క్లుప్తంగా

మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి

నేరడిగొండ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యాపార సముదాయాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ప్రజలు మోదీకి మద్దతుగా మేమున్నామని స్వచ్ఛందంగా సభ్యత్వ నమోదు చేసుకోవడానికి ముందుకు వస్తున్నారని తెలిపారు. సాబ్లే సంతోష్ సింగ్, బాక్రే శేఖర్, బొంతుకుల శ్రీను, జాదవ్ భీంరావ్, సరసాని మహేందర్ రెడ్డి, గాదే శంకర్, రితీష్, మనోజ్, మోతిరాం, సందీప్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఇచ్చోడ: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా మండలంలోని దేవుల్ నాయక్ తండా, సాథ్‌నంబర్ గ్రామాల్లో పర్యటించారు. దేవుల్‌నాయక్‌తండాలో డ్రెయినేజీలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

అగ్నిమాపక శాఖ ద్వారా అత్యవసర సేవలు

ఇచ్చోడ: అగ్నిమాపక శాఖ ద్వారా అత్యవసర సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఇచ్చోడ అగ్నిమాపక శాఖ అధికారి అశోక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయంలో నూతన వాహనానికి ప్రత్యేక పూజలు చేసి, మాట్లాడారు. పాత వాహనం కాలపరిమితి ముగియడంతో ప్రభుత్వం నుంచి నూతన వాహనం మంజూరైనట్లు తెలిపారు. సిబ్బంది దేవేందర్, రవి, విజయ్‌కుమార్, రణధీర్ పాల్గొన్నారు.

నేడు ఉపాధిహామీ ప్రజావేదిక

ఇచ్చోడ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై శనివారం ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఈజీఎస్ ఏపీవో నరేందర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 14వ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 2023- 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనుల వేదిక ఉదయం 10 గంటలకు వ్యవసాయ మార్కెట్‌యార్డులో రైతువేదికలో చేపట్టనున్నట్లు తెలిపారు.

ఆర్థిక సాయం

సిరికొండ: మండల కేంద్రానికి చెందిన గ్రామ పంచాయతీ కార్మికుడు దాసరి శ్రీనివాస్ మూర్ఛవ్యాధితో మృతి చెందడం, అంతకు ముందే ఆయన భార్య దాసరి రజిత మృతి చెందడంతో అనాథలుగా మారిన ఆయన పిల్లలకు శ్రీ సాయి వైకుంఠ ట్రస్టు చైర్మన్ రవికిరణ్ యాదవ్ తన వంతుగా వారికి రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. నిత్యావసర సరుకులు శుక్రవారం పిల్లలకు అందించారు. ట్రస్టు సభ్యులు పోశాలు, రవి, రాజన్న, రాములు, మాజీ సర్పంచ్ పెంటన్న, బాలాజీ పాల్గొన్నారు.

తాగునీటిపై అవగాహన కల్పించాలి

ఉట్నూర్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు తాగునీటి వినియోగంపై గ్రామ మంచినీటి సహాయకులు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మిషన్ భగీరథ మంచినీటి సహాయకుల శిక్షణ శిబిరంలో పాల్గొని మాట్లాడారు. ప్రతీ రోజు నీటిని పరీక్షించాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని కేజీబీ ప్రాంగణంలోని బాలికల పోస్ట్ మెట్రిక్‌వసతి గృహాన్ని సందర్శించారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ ఆసుపత్రి ప్రధాన ద్వారం ఎదుట డ్రెయినేజీపై పదేళ్ల క్రితం చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. అక్కడి ఆక్రమణలను ఇది వరకే తొలగించారు. డ్రెయినేజీపై నిర్మించిన అక్రమ కట్టడాన్ని కూల్చివేయాలని ఆదేశించినప్పటికీ ఎవరూ స్పందించలేదు. రంగంలోకి దిగిన బల్దియా సిబ్బంది జేసీబీ సాయంతో నేలమట్టం చేశారు.

పార్కులో 'స్వచ్ఛత హీ సేవా'

ఆదిలాబాద్‌రూరల్: మావలలోని హరితవనం పార్కులో ఆదిలాబాద్ మున్సిపాలిటీ సిబ్బంది స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పార్కు ఆవరణలో ఉన్న చెత్తను తొలగించడంతో పాటు పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

విహార యాత్రకు విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ, కేజీబీవీ పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను శుక్రవారం కుంటాల జలపాతం విహారయాత్రకు తీసుకెళ్లారు. కాగా జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి రవి కుమార్, డీఈవో ప్రణీత పాల్గొన్నారు.

ఏడు తరగతులు ఇద్దరే ఉపాధ్యాయులు



లోకారి ప్రభుత్వ పాఠశాల


విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు

నార్నూర్: గాదిగూడ మండలంలోని లోకారి(బి) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు మొత్తం 102 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మొత్తం ఐదుగురు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా.. కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో విద్యార్థులకు విద్యా అందని ద్రాక్షగా మారుతోంది. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించేందుకు 'అమ్మ ఆదర్శ పాఠశాల' పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నా.. నిరుపేద విద్యార్థులకు మాత్రం విద్య అందడం లేదు. సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపిస్తున్నా.. విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులు అవసరం ఉన్న చోట మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం లేదు. పాఠశాలలో చదువుతున్నా విద్యార్థులకు సరైనా విద్యా బోధనలు జరగడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. గతంలో అనేకసార్లు విద్యాశాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని అవేదన వ్యక్తం చేస్తున్నారు. మారుతున్నా.. కాలానికి అనుగుణంగా ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యనందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సౌకర్యాలు కరువు

మనఊరు.. మనబడి పథకంలో భాగంగా ప్రభుత్వం పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ. 16 లక్షలు పైగా నిధులు మంజూరు చేసింది. దీంతో మరుగుదొడ్లు, ప్రహరీ, తాగునీటి వసతి కల్పించాల్సి ఉంది. కానీ కాంట్రాక్టర్ చేసిన పనికి డబ్బులు రాకపోవడంతో పనులు నిలిపివేశారు. పాఠశాలలో తాగునీటి సౌకర్యం లేదు. ప్రహరీ నిర్మించలేదు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు మరుగుదొడ్లు లేక పోవడంతో ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. అధికారులు స్పందించి పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామస్తులు, విద్యార్థులు కోరుతున్నారు.

కష్టంగా ఉంది

పాఠశాలలో మొత్తం ఏడో తరగతి వరకు మొత్తం102 మంది విద్యార్థులు ఉన్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. తరగతుల నిర్వహణ కష్టంగా ఉంది. ఉపాధ్యాయులను నియమించాలి. నిధులు విడుదల కాకపోవడంతో పనులు ముందుకు సాగడంలేదు. అధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించాలి.

– అడే సంధ్యారాణి, హెచ్‌ఎం

మహిళలు స్వశక్తితో ముందుకెళ్లాలి


వస్త్ర దుకాణాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌డీవో సాయన్న

తాంసి: మహిళలు స్వశక్తితో ముందుకెళ్లాలని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. మండలంలోని కప్పర్ల గ్రామంలో స్వయంఉపాధిలో భాగంగా ఏర్పాటు చేసిన సిరిసిల్ల చేనేత వస్త్ర దుకాణాన్ని స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదుగేందుకు వారికి ఎన్నో స్వయం సహాయక పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మహిళలు వారికి నైపుణ్యం ఉన్న రంగాల్లో రాణించి, కుటుంబానికి ఆసరాగా నిలవాలన్నారు. గ్రామంలో గంద్రత్ అనూష ఏర్పాటు చేసిన సిరిసిల్ల చేనేత వస్త్ర దుకాణాన్ని ఆదర్శంగా తీసుకొని మహిళలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి గంద్రత్ సంతోష్, మాజీ సర్పంచ్ సదానంద్, నారాయణ, భగువాండ్లు, కొడల సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి


మాట్లాడుతున్న సంగెపు బొర్రన్న

తాంసి: ఖరీఫ్ పంట సీజన్ ముగుస్తున్నందున వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని రైతుస్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో రైతులతో కలిసి రైతుభరోసా విడుదల చేయాలన్నారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ.. రైతులు రుణమాఫీ, రైతుభరోసా రాక ఇబ్బంది పడుతున్నారని, రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీని పూర్తిస్థాయిలో చేయాలన్నారు. ప్రస్తుతం కుటుంబ నిర్ధారణ పేరిట సర్వే చేస్తూ.. ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించే విధంగా రైతు భరోసా, రుణమాఫీని పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు సతీష్ రెడ్డి, అశోక్, నరోత్తం రెడ్డి, గడ్డం సురేందర్ పాల్గొన్నారు.

మల్టీపర్పస్ వర్కర్లకు శిక్షణ

నార్నూర్: గ్రామాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా ఉండేందుకు గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లకు నాలుగు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జవహర్‌తో కలిసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ, తాగునీటి సమస్యపై గ్రామస్థాయిలో పరిష్కరించే విధంగా నాలుగు రోజులపాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్లంబింగ్, పైప్ లైన్ లీకేజీలు, మరమ్మతులు, వెల్త్ హీటింగ్ ప్లేట్, టీ, వై జంక్షన్, డమ్మీ, పైప్‌లైన్ జాయింటింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీవో స్వప్నశీల, తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధి కోసమే సహకార సంఘం

నేరడిగొండ: రైతుల అభివృద్ధి కోసమే సహకార సంఘాలు ఉన్నాయని సంఘం చైర్మన్ సాబ్లే కిషోర్ సింగ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘంలో ఏర్పాటు చేసిన మహాజన సభ సమావేశంలో మాట్లాడారు. సహకార సంఘాల ద్వారా ఎరువుల విక్రయాలు, రుణాల పంపిణీ, పంటల కొనుగోళ్లు చేపడుతున్నామన్నారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఏడీసీసీ బ్యాంక్ ఏర్పాటు చేయాలని రైతులు, సహకార సంఘం పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానం చేశారు. సంఘం లావాదేవీలను సీఈవో బారే నాగభూషనం చదివి వినిపించారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు కలాలి వెంకట రమణ, ఆడె వసంత్‌రావు, నారాయణ రెడ్డి, బన్సీ, గోపి, కృష్ణ, రాంచందర్, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వర్తించాలి

ఆదిలాబాద్‌రూరల్: జాతీయ గ్రామీన ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపడుతున్న పనుల వివరాల రికార్డులను సక్రమంగా నిర్వర్తించాలని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఆదిలాబాద్ రూరల్ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన వివిధ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఇదిలా ఉండగా మండలంలో గల 34 గ్రామ పంచాయతీల్లో రూ. 4.68 కోట్ల విలువ చేసే పనులు చేపట్టారు. కొన్ని జీపీలలో రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడం, కొలతలు అధికంగా రాయడం, కూలీలు పనులకు వెళ్లకున్న పనులకు వెళ్లినట్లు రికార్డుల రాయడం వంటివి తనిఖీలో వెలుబడ్డాయి. అడిషనల్ డీఆర్‌డీవో కుటుంబరావు, ఏపీడీ కృష్ణారావు, ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, ఏపీవో జాకీర్ హుస్సేన్, ఈసీ గంగాధర్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

నార్నూర్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని సోనాపూర్, బేతాగూడ గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం తొమ్మిది మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, రక్తం నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తప్పనిసరిగా పాలు, చేపలు, గుడ్లు, ఆకుకూరలు, ఐరన్, కాల్షియం మాత్రలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్ దాస్, వైద్య సిబ్బంది గణేష్ కుమారి, ప్రియాంక, విమల, కైలాస్, జవహర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అత్తపై దాడిచేసిన నిందితుడి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: భార్యను కాపురానికి పంపడం లేదని అత్తపై దాడిచేసిన నిందితుడు కె.పునీత్‌ను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఇటీవల పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన ఆయన అత్త రేఖపై కొడవలితో దాడి చేసి గాయపర్చాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

గంజాయి విక్రయదారుడి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: బేల మండలంలోని రాయ్‌పూర్‌కు చెందిన కొడప సుపారిను టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం ఉదయం రైల్వేస్టేషన్ గేటు వద్ద పోలీసు వాహనాన్ని చూసి పరుగులు తీశాడు. దీంతో అనుమానం వచ్చి ఆయనను అదుపులోకి తీసుకొని విచారించారు. ఆయన వద్ద 56 గ్రాముల గంజాయితో పాటు రూ.2 వేలు స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు.

నాణ్యమైన విద్యనందించాలి

నేరడిగొండ: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని తహసీల్దార్ కలీమ్ ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులతో పాటు సరుకుల నిల్వలను పరిశీలించారు. వంట గదులను సందర్శించి నాణ్యమైన భోజనం వండిపెట్టాలని సూచించారు. ఇప్పటి నుంచే పరీక్షల కోసం సన్నద్ధం చేయాలన్నారు. ఆయన వెంట కేజీబీవీ ప్రత్యేకాధికారి రజిత, ఆర్ఐ నాగోరావు, తదితరులు పాల్గొన్నారు.

డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో వైద్య శిబిరం నిర్వహించారు. శుక్రవారం బస్తీ దవాఖానాలో ఏర్పాటు చేసిన శిబిరానికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య ప్రారంభించారు. ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ గంగారాం, అరుగుల అశోక్, అజయ్ పాల్గొన్నారు.

ఎస్టీ వర్గీకరణ చేయాలి

ఉట్నూర్‌రూరల్: విద్య, వైద్య, ఉద్యోగ, ఉపాధిలో సమాన అవకాశాలు కల్పించడం కోసం ఎస్టీ వర్గీకరణ చేయాలని రాజ్ గోండ్‌సేవా సమితి నాయకులు కోరారు. శుక్రవారం తహసీల్దార్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశంరావు, జిల్లా అధ్యక్షుడు వెడ్మ కొద్దు, గేడం నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల ఆరోగ్యంపై దృష్టి

ఆదిలాబాద్: ఆర్టీసీ కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ డిపో డిస్పెన్సరీలో గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఉద్యోగుల జీవిత భాగస్వామికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జీవిత భాగస్వామి ఆరోగ్యంగా ఉంటేనే వారు ఉత్సహంగా పని చేస్తారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం ప్రవీణ్ కుమార్, డీఎం కల్పన, యోగేష్, వెల్ఫేర్ బోర్డ్ మెంబర్ విజయశ్రీ, హెల్త్ వలంటీర్లు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు

ఇంద్రవెల్లి: మండలంలోని హర్కపూర్ అంద్‌గూడ శివారులో పేకాడుతున్న ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించగా.. పేకాట ఆడుతున్న ఏడుగురు పట్టుబడినట్లు పేర్కొన్నారు. వారి వద్ద రూ. 2,730 స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పంచాయతీ కార్మికులకు వైద్య పరీక్షలు

సిరికొండ: మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీవో సంతోష్ కుమార్, సిరికొండ పంచాయతీ కార్యదర్శి అరుణ్, వైద్య సిబ్బంది మహేశ్, గంగారం, సునీల, ఆశ కార్యకర్త జ్యోతి పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సర్వసభ్య సమావేశం

కైలాస్‌నగర్: ఈ నెల 28న ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ ప్రకటనలో తెలిపారు. చైర్మన్ జోగు ప్రేమేందర్ అధ్యక్షత ఉదయం 11గంటలకు కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశానికి అధికారులు, కౌన్సిల్ సభ్యులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి: రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని కేస్లాపూర్ రైతువేదిక భవనంలో ఐకార్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వ్యవసాయ పని ముట్లు, స్టాళ్లను పరిశీలించారు. శాస్త్రవేత్తలు గ్రామీణ ప్రాంతంలోని రైతులకు పంట సాగు విధానంపై అవగాహన కల్పించాలన్నారు. ఐకార్ శాస్త్రవేత్తలు వికేసింగ్, మనోరంజన్, నర్సింహులు, సంజీవ్‌రెడ్డి, శ్రీధర్, భారత్‌కుమార్, అశోక్, ఆశిష్, వ్యవసాయ అధికారి రాథోడ్ గణేష్ పాల్గొన్నారు.

గోండి లిపి పండితుడి మృతి సమాజానికి తీరని లోటు

నార్నూర్: గోండి లిపిని భద్రపరిచి గోండు భాషా గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేయడంలో కొట్నాక్ జంగు కృషి చేశారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండలంలోని గుంజాల గ్రామానికి వెళ్లి ఇటీవల మృతి చెందిన కోట్నాక్ జంగుతో పాటు అర్క జైవంతరావ్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన మృతి సమాజానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారి

బేల: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకులం పాఠశాలను శుక్రవారం మండల ప్రత్యేకాధికారి, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ మనోహర్ తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. మధ్యాహ్నం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్‌కుమార్, ప్రిన్సిపాల్ రంగన్న, తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి


నివాళులర్పిస్తున్న మాజీ జెడ్పీ చైర్మన్ జనార్దన్


నివాళులర్పిస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్‌రూరల్: మలిదశ తెలంగాణ రాష్ట్ర పోరాట యోధుడు, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని జెడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాపూజీ చౌక్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహనీయుడు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసి కావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, నారాయణ, సేవ్వా జగదీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు సదాశివ్, సంతోష్, రాజేశ్వర్, ఎర్రన్న, శంకర్, స్వామి, రమేష్, నర్సయ్య, లక్ష్మణ్, గణేష్, శ్రావణ్, సాగర్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ్ ఐక్యంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఆదిలాబాద్‌రూరల్: సమాజ్ ఐక్యంగా ఉండాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, జెడ్పీ మాజీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో అఖిల భారతీయ బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డి నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. బంజారాలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. సమావేశంలో జైసింగ్ రాథోడ్, నరేందర్ రాథోడ్, సురేశ్ నాయక్, హీరా నాయక్, పవన్ నాయక్, సుభాష్ జాదవ్, బలిరాం, వినాయక్ జాదవ్, నారాయణ, బాబూలాల్, కిషన్, మధుకర్ పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కస్తూరిబా పాఠశాలలను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం సందర్శించారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీ వంటగదిని పరిశీలించారు. రూ. 5 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కోర్టు ఆవరణలో 'స్వచ్ఛభారత్'

బోథ్: మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో శుక్రవారం స్వేచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోర్టు ఆవరణలో సిబ్బంది చెత్తను తొలగించారు. ఏజీపీ పంద్రం శంకర్, న్యాయవాదులు కుమ్మరి విజయ్ కుమార్, కోర్టు సూపరింటెండెంట్ శేఖర్ రెడ్డి, మాజీద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గణిత పాఠ్యాంశం విడుదల

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చిలుక సతీష్ రూపొందించిన 'సులభంగా టేబుల్ నేర్పడం ఎలా? అనే గణిత పాఠ్యాంశాన్ని మండల విద్యాధికారి ఇదవు పోశెట్టి శుక్రవారం యూట్యూబ్‌లో విడుదల చేశారు.

జలపాతాలను సందర్శించిన రాజయ్య

బోథ్: బోథ్ మండలంలోని పొచ్చెర, నేరడిగొండ మండలంలోని కుంటాల జలపాతాలను రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య శుక్రవారం సందర్శించారు. జలపాతాలు సుందరంగా ఉన్నాయని అన్నారు. పర్యాటకంగా జలపాతాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

బోథ్: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు గణేష్ అన్నారు. శుక్రవారం పాఠశాలను పరిశీలించారు. బీటలు వారిన గోడల వల్ల బాలికలకు ప్రమాదం పొంచి ఉందని అన్నారు.

పర్యాటక రంగాన్ని కాపాడుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: పర్యాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.సంగీత అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని శుక్రవారం కళాశాలలో నిర్వహించారు. వ్యాసరచన, ఉపన్యాస, పెయింటింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌ను కలిసిన నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా పర్యటనకు వచ్చినా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారదను జిల్లా మహిళా గౌడ సంక్షేమ సంఘ అధ్యక్ష కార్యదర్శులు పద్మావతి గౌడ్, రేఖ, రజిని, కార్యవర్గ సభ్యులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం

బోథ్: మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్సియల్ పాఠశాల నూతన ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన సంగీతను మండల ఎమ్మార్పీఎస్ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. నాయకులు కుడాల స్వామి, గజ్జల శంకర్, కారెం రవి, అన్నెపాక అశోక్, ప్రసాద్, మహేశ్, రాష్ట్రపాల్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి..

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఘన్‌పూర్ ఎంపీపీఎస్ పాఠశాలకు చెందిన మండాడి చిన్నబాబు ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు తీసుకోవడంపై పాఠశాల యాజమాన్య కమిటీ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ నాయకులు సన్మానించారు.